సాక్షి
కామారెడ్డి
సోమవారం ၊ 4 ၊ నవంబర్ ၊ 2024



మండలానికో చేపల మార్కెట్

మండలానికో చేపల మార్కెట్ నిర్మించేందుకు కృషి చేస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు.

- 8లో ▸



ప్రతి గింజా కొనుగోలు చేస్తాం

రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
35.7 /16.2

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

హాస్టళ్ల పరిశీలన



భిక్కనూరు: మండల కేంద్రంలోని బాలుర వసతి గృహంతోపాటు జంగంపల్లిలోని జ్యోతీబాపూలే గురుకుల పాఠశాలను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి ఆదివారం తనిఖీ చేశారు. జ్యోతీబాపూలే గురుకులంలో విద్యార్థినులు వంట పనులు చేస్తుండడాన్ని గమనించి ఎమ్మెల్యే సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులతో పనులు చేయించడం మంచి పద్ధతి కాదన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు.

డివైడర్ కూల్చిన ప్రాంతంలో బారికేడ్ల ఏర్పాటు



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని జీవీఎస్ కళాశాల వద్ద జాతీయ రహదారి మధ్యలోని డివైడర్‌ను కూల్చివేసిన ఘటనను జిల్లా ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. కూల్చి వేయించిన వ్యక్తిపై ఇప్పటికే కేసు నమోదు చేశారు. కాగా కూల్చివేసిన ప్రాంతంలో ఆదివారం అధికారులు బారికేడ్లను ఏర్పాటు చేయించారు. ఈ కూల్చివేతకు ఆర్‌అండ్‌బీ, ఇతర శాఖల అధికారుల అనుమతి లేకున్నా మున్సిపల్ నుంచి రూ.30 వేల నిధులు మంజూరు చేస్తూ కౌన్సిల్ సమావేశపు ఎజెండాలో చేర్చడంపై ఉన్నతాధికారులు మున్సిపల్ అధికారులపై సీరియస్ అయినట్లు తెలిసింది. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు కూల్చివేసిన చోట డివైడర్‌ను మళ్లీ నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

విద్యాశాఖలో అక్రమాలు

జిల్లాలో విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ చేస్తున్న ప్రయత్నాలకు విద్యాశాఖ అధికారులు గండి గొడుతున్నారు. అక్రమ డిప్యుటేషన్లతో డబ్బులు దండుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ విద్యాసంవత్సరంలో ఇప్పటి వరకు వందకుపైగా ఓరల్ డిప్యుటేషన్లు ఇచ్చినట్లు తెలుస్తోంది.

- ఫైనలిస్తే కోరుకున్న బడికి..
- జిల్లాలో అడ్డగోలుగా టీచర్ల డిప్యుటేషన్లు
- కలెక్టర్ దృష్టి సారించాలని కోరుతున్న విద్యాభిమానులు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 4 వేల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల ఉపాధ్యాయ నియామక ప్రక్రియ పూర్తి చేసింది. అయితే ఈ ప్రక్రియ మొదలుపెట్టకముందు ఖాళీగా ఉన్న చోట సమీపంలోని ఏదేని పాఠశాలలో అదనంగా ఉన్న టీచర్లను సర్దుబాటు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఎక్కడైనా ఉపాధ్యాయుల సమస్య ఉంటే అదే మండలంలోని ఏదైనా స్కూళ్లో అవసరానికి మించి ఉన్నవారిని మాత్రమే సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. అయితే జిల్లా విద్యాశాఖ అధికారులు మాత్రం ఇష్టారీతిన డిప్యుటేషన్లు చేపట్టారు. మండల పరిధే కాదు.. నియోజకవర్గ పరిధి కూడా దాటి జిల్లా కేంద్రానికి సమీపంలోని పాఠశాలలకు పంపించారు. విద్యార్థులు ఉన్న స్కూళ్ల నుంచి కూడా టీచర్లను ఇతర ప్రాంతాలకు పంపించడం గమనార్హం.

సమగ్ర విచారణ జరిపిస్తే..

జిల్లా విద్యాశాఖలో పనిచేసే ఒకరిద్దరు ఉద్యోగులు అక్రమ డిప్యుటేషన్ల వ్యవహారంలో కీలకభూమిక పోషిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులను మేనేజ్ చేయడంలో వారే కీలకంగా పనిచేస్తున్నారని సమాచారం. అక్రమ డిప్యుటేషన్ల వ్యవహారంపై కలెక్టర్ స్పందించి, ఇతర శాఖల అధికారులతో సమగ్ర విచారణ జరిపిస్తే విద్యాశాఖలో మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయి.

ఎమ్మెల్యేల పేరు చెబుతూ..

జిల్లాలో ఒకరిద్దరు టీచర్లు తమ కుటుంబ సమస్యలను పేర్కొంటూ డిప్యుటేషన్ కోసం జుక్కల్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యేలకు అర్జీలు పెట్టుకున్నట్లు తెలిసింది. వాటిని పరిశీలించాలని ఆ ఎమ్మెల్యేలు విద్యాశాఖ అధికారులకు సూచించినట్లు సమాచారం. దీనిని విద్యాశాఖ అధికారులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. ఎమ్మెల్యేలు చెప్పారంటూ అడ్డగోలుగా డిప్యుటేషన్లు ఇచ్చారు. ఒక టీచర్ తన పోస్టింగ్ దూరంగా ఉండి, వృద్ధులైన తల్లిదండ్రులను చూసుకోలేకపోతున్నానని ఎమ్మెల్యేకు మొరపెట్టుకుంటే.. దానిని పరిశీలించాలని సదరు ఎమ్మెల్యే చెప్పినందుకు దానినే అస్త్రంగా చేసుకుని ఆ నియోజకవర్గంలో ఏకంగా 20 మందికి అక్రమ డిప్యుటేషన్లు ఇచ్చినట్లు తెలుస్తోంది. మరో నియోజకవర్గంలోనూ ఇలాగే పలువురు ఉపాధ్యాయులను కోరుకున్న స్థానానికి పంపించినట్లు సమాచారం. ఇలా జిల్లాలో వందకుపైగా అక్రమ డిప్యుటేషన్లు జరిగినట్లు ఉపాధ్యాయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ వ్యవహారంలో భారీగా డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి.

ఇష్టారీతిన..

- నాగిరెడ్డిపేట మండలంలోని తాండూరు ఉన్నత పాఠశాలలో పనిచేసే ఫిజికల్ డైరెక్టర్‌ను సదాశివనగర్ మండలం పద్మాజీవాడీ స్కూల్‌కు డిప్యుటేషన్‌పై పంపించారు. రెండు స్కూళ్ల మధ్య దూరం సుమారు వంద కిలోమీటర్లు.. మరో విశేషం ఏమిటంటే అసలు పద్మాజీవాడిలో పీడీ పోస్టే లేదు. ఎల్లారెడ్డి పట్టణంలో పీడీ పోస్టు ఖాళీగా ఉన్నా, అక్కడ ఇవ్వకుండా పద్మాజీవాడీకి పంపడంలో పరమార్థమేమిటో విద్యాశాఖ అధికారులకే తెలియాలి.
- లింగంపేట మండలం శెట్పల్లి సంగారెడ్డి స్కూల్‌లో పనిచేసే టీచర్‌ను మొదట కామారెడ్డి పట్టణంలోని గంజ్ హైస్కూల్‌కు పంపించారు. అక్కడ పోస్టు భర్తీ కావడంతో తాడ్వాయి మండలం కృష్ణాజీవాడీ ఉన్నత పాఠశాలకు డిప్యుటేషన్ వేశారు. లింగంపేట మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంది. అవసరమైతే అక్కడకు పంపొచ్చు. పోతాయిపల్లి ఉన్నత పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయురాలు మెడికల్ లీవ్‌లో ఉన్నారు. అక్కడ టీచర్ అత్యవసరం. కానీ ఆ రెండు చోట్లకు కాకుండా వేరే మండలానికి డిప్యుటేషన్ వేయడం గమనార్హం.
- ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని లింగంపేట బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేసే టీచర్‌ను కామారెడ్డి నియోజకవర్గంలోని లింగాపూర్ ఉన్నత పాఠశాలకు డిప్యుటేషన్‌పై పంపించారు. రెండు స్కూళ్ల మధ్య దూరం 40 కిలోమీటర్లు కావడం గమనార్హం.
- ఎల్లారెడ్డి మండలంలోని మత్తమాల ఉన్నత పాఠశాలలో పనిచేసే ఫిజికల్ డైరెక్టర్‌ను కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డికి డిప్యుటేషన్‌పై పంపించారు. కాగా అదే మత్తమాల పాఠశాలకు మరో స్కూల్‌నుంచి ఫిజికల్ డైరెక్టర్‌కు డిప్యుటేషన్‌పై పంపడం గమనార్హం.
- మాచారెడ్డి మండలంలోని నడిమితండాలో పనిచేసే ఉపాధ్యాయుడిని కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి ప్రాథమిక పాఠశాలకు డిప్యుటేషన్‌పై పంపించారు. రెండు స్కూళ్ల మధ్య దూరం 50 కిలోమీటర్లు.
- జుక్కల్ నియోజకవర్గంలోని నిజాంసాగర్ మండలం నర్వ ఉన్నత పాఠశాలలో పనిచేసే స్కూల్ అసిస్టెంట్‌ను కామారెడ్డి పట్టణంలోని ఇందిరానగర్ ఉన్నత పాఠశాలకు పంపించారు. ఈ రెండు స్కూళ్ల మధ్య దూరం 70 కిలోమీటర్లు.
- జుక్కల్ మండలం బస్వాపూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాల నుంచి ఒక టీచర్‌ను లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలకు డిప్యుటేషన్‌పై పంపించారు.
- రామారెడ్డి మండలం రెడ్డిపేట పాఠశాల టీచర్‌కు కామారెడ్డి మండలం రామేశ్వర్‌పల్లి యూపీఎస్‌కు డిప్యుటేషన్ ఇచ్చారు.
- తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల లేకపోవడంతో అక్కడి ఉపాధ్యాయులను కామారెడ్డి పట్టణం, పరిసర గ్రామాలలోని పాఠశాలలకు పంపించారు. పాఠశాల హెడ్మాస్టర్ మాత్రం రోజూ స్కూల్‌కు వచ్చి వెళ్తుండడం గమనార్హం.

ఏటీసీగా ఎల్లారెడ్డి ఐటీఐ కళాశాల

హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



ఎల్లారెడ్డిలో ఏటీసీ భవనం నిర్మించే స్థలం

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి ప్రభుత్వ ఐటీఐ కళాశాలను ఏటీసీగా(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌గా) అప్‌గ్రేడ్ చేశారని ప్రిన్సిపల్ ఆనంద్ తెలిపారు. ఎల్లారెడ్డికి 2004లో ఐటీఐ కళాశాల మంజూరయ్యింది. అయితే పట్టణంలో సరైన భవనం లేకపోవడంతో కళాశాలను నిజామాబాద్‌లో కొనసాగించారు. అనంతరం అప్పటి ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి కృషితో 2010లో కళాశాల ఎల్లారెడ్డికి వచ్చింది. మొదట్లో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మెకానిక్ డీజిల్, కోపా, వెల్డర్ కోర్సులు నడిపించారు. అయితే కళాశాలకు పూర్తి స్థాయిలో అధ్యాపక పోస్టులు లేకపోవడంతో తాత్కాలిక సిబ్బందిని తొలగించి, కోర్సుల సంఖ్యను తగ్గించారు. ప్రస్తుతం ఈ కళాశాలను ఏటీసీగా అప్‌గ్రేడ్ చేశారు. వచ్చే విద్యాసంవత్సరంలో ఆరు కోర్సులతో ఏటీసీ ప్రారంభం కానుంది. కాగా ఎల్లారెడ్డి ఐటీఐ కళాశాలకు గతంలోనే అధికారులు స్థలాన్ని కేటాయించారు. అయితే దీనికి సంబంధించిన పత్రాలు రెవెన్యూ కార్యాలయంలో లేవు. దీంతో కళాశాల ప్రిన్సిపల్ ఆనంద్ ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి ఎల్లారెడ్డిలో ఐటీఐ కళాశాల భవన నిర్మాణానికి ఐదెకరాలు కేటాయించారు. ఐటీఐ కళాశాలను ఏటీసీగా అప్‌గ్రేడ్ చేయడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మేలు జరగనుంది. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటోంది కాంగ్రెస్సే

- సుప్రీం తీర్పును అమలు చేయకపోతే తాడోపేడో తేల్చుకుంటాం
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

కామారెడ్డి టౌన్: ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటున్నది కాంగ్రెస్ పార్టీనే అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఈఎస్ఆర్ గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ధర్మ యుద్ధ మహాసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాలపాటు పోరాటం చేసి ఎస్సీ వర్గీకరణ సాధించుకున్నామని, అయితే దీనిని అడ్డుకునేందుకు మాలలను ప్రోత్సహిస్తోందని కాంగ్రెస్సేనని విమర్శించారు. 2004లో వర్గీకరణను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పునిస్తే 24 గంటల్లో అమలు చేసిన కాంగ్రెస్.. ఇప్పుడెందుకు కోర్టు తీర్పును అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అంబేడ్కర్ కాలంలో రిజర్వేషన్ల కోసం పోరాటం జరిగిందని, ప్రస్తుతం రిజర్వేషన్ల పంపకం కోసం పోరాటం జరుగుతోందని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లోని కొందరు మాల ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తే సీఎం రేవంత్‌రెడ్డి వారి ఒత్తిడికి తలొగ్గి వర్గీకరణ లేకుండానే ఉద్యోగాల భర్తీ చేపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణపై మంత్రులతో కమిటీ వేసిన సీఎం.. మళ్లీ కమిషన్ ఎందుకు వేశారో చెప్పాలన్నారు. తాను వర్గీకరణకోసం పోరాటం చేస్తున్నప్పుడు ఎంపీగా, ఎమ్మెల్సీగా అవకాశం కల్పించి మంత్రి పదవి ఇస్తామన్న కూడా ఉద్యమం కోసం పదవులను తృణప్రాయంగా వదిలేశానన్నారు. తనకు ఏ పార్టీతో సంబంధంలేదని, తన కండువా ఎప్పటికీ మారదని స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేసి ఉంటే ఇటీవల భర్తీ చేసిన ఉద్యోగాల్లో మాదిగలకు పెద్ద ఎత్తున అవకాశాలు దక్కేవన్నారు. రాష్ట్రపతితో పాటు ప్రధాని నరేంద్రమోదీ, సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకులంగా ఉంటే కాంగ్రెస్ మాత్రం వ్యతిరేకంగా ఉందని ఆరోపించారు. వర్గీకరణపై త్వరలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని, ప్రభుత్వంతో తాడోపేడో తెల్చుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

సమాజ హితమే సంఘ్ లక్ష్యం

- ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర సంపర్క్ ప్రముఖ్ వెంకటేశ్



స్వయం సేవకుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్


సుభాష్‌నగర్ : సమాజ హితమే సంఘ్ లక్ష్యమని ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర సంపర్క్ ప్రముఖ్ టీఎస్ వెంకటేశ్ అన్నారు. ఆదివారం నగరంలోని శివాజీనగర్ ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆర్ఎస్ఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వందేళ్ల ప్రయాణంలో సంఘ్ ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొందన్నారు. దేశ హితం కోసం తమ సర్వస్వాన్ని అర్పించే సైనికుల్లాగా ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులను తయారు చేస్తోందన్నారు. అందుకే నిస్వార్థ శక్తిగా ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థగా అవతరించిందని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం ఏ ఒక్కరికీ వ్యతిరేకం కాదని, సమాజ హితం కోసం మాత్రమేనని అన్నారు. ఈ నెల 10న నగరంలో జరగనున్న భారీ పథ సంచలన్ కార్యక్రమానికి సన్నాహకంగా స్వయం సేవకులు ఐటీఐ ప్రాంతంలో సంచలన్ సాధన చేశారు. నగర కార్యవాహ అర్గుల సత్యం, ప్రతినిధులు సుమిత్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ప్రపంచమంతా రామరాజ్యం కావాలి

- రామరాజ్య స్థాపన న్యాస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునరావు
- కామారెడ్డిలో దక్షిణ భారత్ విభాగ్ తొలి సమావేశం
- వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన ప్రతినిధులు



కార్యక్రమంలో పాల్గొన్న రామరాజ్య స్థాపన న్యాస్ ప్రతినిధులు



మాట్లాడుతున్న మల్లికార్జునరావు

కామారెడ్డి అర్బన్ : ప్రపంచమంతా మళ్లీ రామరాజ్య స్థాపన జరగాల్సిన అవసరం ఉందని రామరాజ్య స్థాపన న్యాస్ జాతీయ అధ్యక్షుడు, విశ్రాంత ఆచార్యులు ఎం.మల్లికార్జునరావు పేర్కొన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లాకేంద్రంలోని కళాభారతిలో రామరాజ్య స్థాపన న్యాస్ దక్షిణ భారత్ విభాగ్ తొలి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మల్లికార్జునరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను 35 ఏళ్లుగా వాల్మీకి రామాయణంలోని శ్లోకాలపై పరిశోధన చేస్తున్నానని, అనేక ఆసక్తికర విషయాలు తెలిశాయని పేర్కొన్నారు. అమెరికా నుంచి మొదలుకొని అట్లాంటికా వరకు పర్వతాలు, నదులు, సముద్రాలు, దేశాల పేర్లు వాల్మీకి సంస్కృత రామాయణంలో ప్రస్తవించారన్నారు. దీనిని బట్టి ఆయా దేశాలకు రాజులున్నారని, ప్రపంచానికి మొత్తం సార్వభౌముడిగా రాముడున్నాడని అర్థమవుతోందని పేర్కొన్నారు. శ్రీరాముడు అంటే భారతీయుల ఆత్మ అన్నారు. శ్రీరాముడి వారసులుగా భూమండలం మొత్తాన్ని రామరాజ్యం చేయడానికి ప్రతి భారతీయుడు కృషి చేయాలన్నారు. ప్రతి రైతు గోఆధారిత వ్యవసాయం చేయాలని, అందరూ ధర్మ మార్గంలో నడవాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్‌పీఆర్ హైస్కూల్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తెలంగాణ సాధు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ స్వామీజీ, రామరాజ్య స్థాపన న్యాస్ జాతీయ కన్వీనర్ ఆర్ఎం పాండే, ప్రతినిధులు పల్విందర్‌జీ, అమిత్‌కుమార్ చౌదరి, కన్వెవర్, స్కంధ శ్రీవాత్సవ్, నంద్‌కుమార్, రమేష్ నూనె, దలిందర్‌సింగ్, స్వరేష్‌సింగ్, ధాన్‌సింగ్, తాళ్లూరు మఠం పీఠాధిపతి వెంకట సత్యనారాయణ ప్రసాదాచార్యులు, కృష్ణామాచార్యులు, విశ్వాత్మ నందగిరి స్వామి, కృష్ణానందస్వామి, రామ్‌లల్లా కామారెడ్డి క్షేత్ర స్థాపకులు వేదయోగి మహరాజ్, కార్యదర్శి ఎస్‌హెచ్ పులారి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనుగోలు కేంద్రం తనిఖీ

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మాగి గ్రామ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం జిల్లా సహకార అధికారి రాంమోహన్ సందర్శించారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం తూకాలు చేపట్టాలని, కేంద్రాల ఇన్‌చార్జీలకు ఆయన సూచించారు. ఆయన వెంట అచ్చంపేట సొసైటీ సీఈవో సంగమేశ్వర్ గౌడ్ తదితరులున్నారు.

అండర్-23 క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-23 బాలుర విభాగంలో ఎంపికలు నిర్వహించి ఆదివారం తుది జట్టును ఎంపిక చేశారు. ఈనెల 4 నుంచి సంగారెడ్డిలో నిర్వహించే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో క్రీడాకారులు పాల్గొననున్నారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డిలు క్రీడాకారుల పేర్లను ప్రకటించారు. విక్రత్, వర్షిత్‌రెడ్డి, రిత్విక్‌రావు, శ్రీకాంత్, హర్షవర్ధన్, అజిత్, నిర్రతి, జస్రిత్‌రెడ్డి, గఫ్రాన్, మాజిద్, నవీన్, హరీశ్, సచిన్, ప్రతాప్, అలీఫ్ ఎంపికయ్యారు. కోచ్‌గా నయూమ్, మేనేజర్‌గా సురేశ్‌బాబు, ఫీల్డింగ్ కోచ్‌గా లలిత్‌రెడ్డిలు వ్యవహరించనున్నారు.

నవల రచయిత లక్ష్మణ్‌కు డాక్టరేట్

నిజామాబాద్ రూరల్: ప్రముఖ నవల రచయిత పోతునూరి లక్ష్మణ్ డాక్టరేట్ అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శనివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారావు వెల్ఫేర్ అసోసియేషన్, రాజస్తాన్ సన్‌రైజ్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. రెండు నవలలకు, 'ప్రలోభం' అనే నవలకు రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతి దక్కింది. ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎంఏ హిస్టరీ, ఎల్ఎల్‌బీ చదివిన లక్ష్మణ్ ప్రాజెక్టు రామడుగుకు చెందిన వ్యక్తి. ఆయన నాలుగేళ్లపాటు ధర్పల్లి ప్రభుత్వ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేశారు.

బెంబేలెత్తిస్తున్న కుక్కలు

- భీమ్‌గల్ కస్తూర్బా పరిసరాల్లో గుంపులుగా సంచారం
- రెండు రోజుల క్రితం ఉపాధ్యాయురాలిపై దాడి

మోర్తాడ్: భీమ్‌గల్ కస్తూర్బా పాఠశాల పరిసరాల్లో కుక్కల బెడద తీవ్రమైంది. కుక్కలు దాడి చేస్తుండటంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం గణితం ఉపాధ్యాయురాలు రజితపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. సుమారు 30 కుక్కలు సంచరిస్తున్నాయని, వాటిని నివారించే చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు. కస్తూర్బా పాఠశాలలో మిగిలిపోయిన అన్నం, కూరలను బయట పారవేస్తుండడంతో వాటిని తినేందుకు వస్తున్న కుక్కలు ఈ ప్రాంతంలోనే సంచరిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

'సహకార' అక్రమాలపై విచారణ పూర్తయ్యేనా?

- సావెల్ సొసైటీలో రూ.80లక్షలు గోల్‌మాల్
- సీఈవోల చేతివాటం
- బాండ్ పేపర్లపై చెల్లింపు రాతలు
- అక్రమాలపై విచారణకు ఉన్నతాధికారుల ఆదేశాలు
- విచారణ అధికారిగా సత్యనారాయణరావు
- రెండు నెలలు గడిచినా పూర్తికాని విచారణ



సావెల్ సహకార సంఘంలో విచారణ చేపడుతున్న విచారణ అధికారి (ఫైల్)

బాల్కొండ: మెండోరా మండలం సావెల్ సహకార సంఘంలో గత కొంత కాలంగా జరిగిన అక్రమాలపై విచారణ పూర్తయ్యేనా? అనే అనుమానాలను సొసైటీ పరిధిలోని రైతులు వ్యక్తం చేస్తున్నారు. సహకార సంఘం సీఈవోగా బాధ్యతలు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో గత ఆగస్టు నెలలో అవినీతి భాగోతం బయట పడింది. దీంతో సెప్టెంబర్ 2న డీసీవో శ్రీనివాస్.. డిచ్‌పల్లి క్లస్టర్ అసిస్టెంట్ రిజిస్టర్ సత్యనారాయణరావును విచారణ అధికారిగా నియమించారు. అప్పటి నుంచి విచారణ ముందుకుసాగింది లేదు. ఇప్పటి వరకు ఎటువంటి నివేదికను ఉన్నతాధికారులకు అప్పగించ లేదు. అసలు విచారణ ఏ స్థాయిలో ఉందో కూడా సంబంధిత అధికారులకే తెలియిన వింత పరిస్థితి ఉంది. గతంలో సీఈవోలుగా పనిచేసిన అధికారులే సొసైటీలో రూ.80లక్షలు గోల్ మాల్ చేశారని, రోజురోజుకు సొసైటీకి నష్టాలు పెరిగాయని రైతులు అంటున్నారు. సావెల్ సహకార సంఘం పరిధిలో సావెల్, మెండోరా, కోడిచర్ల, చాకిర్యాల్ గ్రామాలున్నాయి. గత పాలకవర్గం హయాంలో రూ.35 లక్షల నష్టాలు ఉంటే ప్రస్తుత పాలక వర్గం హయాంలో మరో రూ.45 లక్షలు పెరిగి మొత్తం రూ.80 లక్షలకు చేరింది. ప్రస్తుతం సహకార సంఘం కార్యదర్శి పోస్టు ఖాళీగా ఉంది. ఇంతకు ముందు సీఈవోగా విధులు నిర్వర్తించిన సురేందర్‌రెడ్డి జక్రాన్‌పల్లి మండలం బ్రహ్మణపల్లి సహకార సంఘంలో చేసిన అవినీతితోపాటు సావెల్ సహకార సంఘంలో చేసిన అవినీతి కారణంగా సస్పెండ్‌కు గురయ్యారు. అప్పటి నుంచి సావెల్ సహకార సంఘంలో కార్యదర్శి పోస్టు ఖాళీగా ఉంది. గత ఆగస్టులో వేంపల్లి సహకార సంఘం కార్యదర్శి రంజిత్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించేందుకు ఉన్నతాధికారులు తీవ్రంగా ప్రయత్నించగా, ఉద్యోగానికి రాజీనామా అయినా చేస్తాను కానీ ఆ బాధ్యతలు తనకు వద్దంటూ తేల్చిచెప్పారు. దీంతో నోడల్ అధికారి సుమన్ రంజిత్‌కు సముదాయించి బాధ్యతలు అప్పగించేందుకు ఆగస్టు 31న సహకార సంఘానికి వచ్చారు. అయినప్పటికీ రంజిత్ ససేమిరా అనడంతో అసలు విషయాలు బయటపడ్డాయి. గతంలో కార్యదర్శిగా విధుల నిర్వర్తించిన సురేందర్‌రెడ్డి రూ.35 లక్షల గోల్‌మాల్ చేసి తానే చెల్లిస్తానంటూ బాండు పేపర్ రాసి ఇచ్చాడు. సేల్స్‌మెన్ వద్దనే రూ.10 లక్షల నగదు గోల్‌మాల్ అయినట్లు పాలకవర్గ సభ్యులు తెలిపారు. వీటన్నింటిపై విచారణ అధికారిని నియమించినా ఇప్పటికీ ఫలితం లేకుండాపోయింది. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా విచారణ ముందుకు సాగడం లేదని ఆరోపణలు ఉన్నాయి. నిజాలు నిగ్గుతేల్చి నివేదిక వెంటనే అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

విచారణ కొనసాగుతోంది

సావెల్ సహకార సంఘంలో అవినీతి జరిగినట్లు ఆరోపణలు రావడంతో గత రెండు నెలల క్రితం సత్యనారాయణరావును విచారణాధికారిగా నియమించాం. విచారణ కొనసాగుతోంది. నివేదిక అందిన తరువాత చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, డీసీవో, నిజామాబాద్

ఆన్‌లైన్‌లో నకిలీ పోలీసులు

రామారెడ్డి మండలంలోని ఓ గ్రామానికి చెందిన గొర్ల కాపరి రాజయ్యకు పోలీసు డీపీతో ఉన్న వాట్సాప్ నంబర్‌నుంచి కాల్ వచ్చింది. నీ కొడుకు డ్రగ్స్ తీసుకుంటూ పోలీసులకు చిక్కాడని రూ.40 వేలు వెంటనే ఫోన్ పే చేయాలని లేనిపక్షంలో నీ కొడుకు జైలుకు వెళ్తాడని హెచ్చరించాడు. అయితే ఆ గొర్ల కాపరికి కొడుకే లేడు. దీంతో సదరు గొర్ల కాపరి మీరేం చేసుకుంటారో చేసుకోండి అని సమాధానమిచ్చాడు. రెచ్చిపోయిన సైబర్ నేరగాళ్లు నీ కొడుకుని చంపేస్తాం, నీ ఇంటి అడ్రస్ తెలుసుకుని పట్టుకుపోతామంటూ పదేపదే ఫోన్‌లో బెదిరింపులకు పాల్పడ్డారు. గ్రామంలోని తెలిసిన వారికి విషయం తెలుపడంతో అది ఫేక్ కాల్ అని నిర్ధారణకు వచ్చారు.

- రూట్ మార్చిన సైబర్ నేరగాళ్లు
- జిల్లాలో పెరుగుతున్న బాధితుల సంఖ్య

రామారెడ్డి: సైబర్ నేరగాళ్లు కొత్త దారులు ఎంచుకుంటున్నారు. ఏకంగా పోలీసు ఫొటోలను వాట్సాప్ డీపీలుగా పెట్టుకుని అమాయకులకు ఫోన్‌లు చేసి బెదిరిస్తూ ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారు. గడిచిన నెల రోజుల్లోనే కామారెడ్డి జిల్లాలో ఈ తరహా కేసులు ఎక్కువ సంఖ్యలో నమోదయ్యాయి. జిల్లాలోని ప్రతి గ్రామంలో ఎవరో ఒకరికి ఫోన్ చేయడం.. బెదిరించడం.. ఒక్కరూ భయపడినా ఆర్థికంగా దోచేస్తూ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన వారి కుటుంబాల్లోని వారికి ఇటువంటి కాల్స్ ఎక్కువగా వస్తున్నాయి. పై చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారిని, వ్యాపారాలు చేసే వారిని ఇలా ఎవరినీ వదలకుండా పోలీసుల ఫొటోలతో వాట్సాప్ కాల్స్ చేస్తున్నారు. జిల్లాకు చెందిన ఓ రైతు నుంచి ఇదే తరహాలో లక్ష కాజేశారు. అమెరికాలో ఉన్న నీ కూతురు ఆపదలో ఉందని నమ్మించి ఫోన్ పే ద్వారా డబ్బులు పంపించుకున్నారు. తాను మోసపోయినట్లు ఆలస్యంగా గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రామారెడ్డి గ్రామానికి చెందిన అనిల్ అనే వ్యక్తికి మీ కొడుకు జైల్లో ఉన్నాడని కేసు నుంచి తాము తప్పిస్తామని ఫేక్ పోలీస్ డీపీతో ఫోన్ కాల్ చేశారు. అయితే ఆయన కొడుకు ఇంట్లోనే ఉండడంతో ఇది మోసంగా గుర్తించి కేటుగాళ్లను అనిల్ ఫోన్‌లోనే బెదిరించాడు.



జాగ్రత్తగా ఉండాలంటున్న పోలీసులు

కొత్త రకమైన సైబర్ మోసాలు వెలుగు చూస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. నిజంగా తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని.. ఎవరికీ డబ్బులు ఇవాల్సిన పనిలేదని అవగాహన కార్యక్రమాల్లో పేర్కొంటున్నారు. పోలీస్ అధికారుల డీపీతో వాట్సాప్ లేదా నార్మల్ కాల్ వస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని సూచిస్తున్నారు. డబ్బులు పోగొట్టుకుంటే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని పేర్కొంటున్నారు. పోలీసులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నా ఎవరో ఒకరు సైబర్‌నేరగాళ్లకు చిక్కుతూనే ఉన్నారు. కొంతమంది చదువుకున్న వారు సైతం ఫేక్ పోలీసుల వలకు చిక్కుతున్నారు. అయితే పరువు పోతుందనే కారణంగా పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు.

వెంటనే ఫిర్యాదు చేయండి



ఫేక్ పోలీసుల పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలపై ప్రజలకు అవగహన కల్పిస్తున్నానే ఉన్నాం. ఫేక్ డీపీలతో పోలీసులమని చెప్తే నమ్మకండి. పోలీసులకు ఫిర్యాదు చేయండి. సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయండి.

– నరేశ్, రామారెడ్డి, ఎస్సై

పోలీసులు ఆన్‌లైన్‌లో అరెస్టు చేయరు



పోలీసులు ఆన్‌లైన్ కాల్స్ చేసి అరెస్టులు చేయరు. ఫోన్ కాల్స్‌లో బెదిరింపులకు పాల్పడితే భయపడొద్దు. పోలీసులు అరెస్టు చేసేది ఉంటే ముందుగా నోటీసులు ఇచ్చి అరెస్టు చేసి రిమాండ్ తరలిస్తారు. కానీ ఆన్‌లైన్ లో అరెస్టులు చేయరు. అనుమానం వచ్చిన వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలి. ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దు.

– అమృత్‌రావు, అడ్వొకేట్, కామారెడ్డి

మండలానికో చేపల మార్కెట్



తాడ్వాయి శబరిమాత చెరువులో చేపలను వదులుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు



మత్స్యకారులకు గుర్తింపు కార్డులు అందజేస్తూ..

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలానికో చేపల మార్కెట్‌ను నిర్మించేలా తన వంతు కృషి చేస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు అన్నారు. ఆదివారం ఆయన తాడ్వాయి మండల కేంద్రంలోని శబరిమాత చెరువులో చేపలను వదిలి మాట్లాడారు. ప్రభుత్వం నియోజకవర్గంలోని 217 చెరువులలో 29.15లక్షల నాణ్యమైన చేప పిల్లలను వేయనున్నట్లు తెలిపారు. అలాగే ఎల్లారెడ్డిలో 50 ఎకరాలలో చేపల ఫ్యాక్టరీని ఏర్పాటయ్యేలా చూస్తానన్నారు. నియోజకవర్గంలో పెద్దపెద్ద ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగాలు వచ్చేలా చూస్తానన్నారు. చిట్యాల, సంతాయిపేట్, అన్నారం, అన్నారం తండా, సోమారం, సోమారం తండా గ్రామాలలో నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు చిట్యాల గ్రామంలో విద్యుత్ ఉప కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు రూ.1.75 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. తాడ్వాయి మినీ స్టేడియాన్ని పరిశీలించి అసంపూర్తిగా ఉన్న పనులకు నిధులు మంజూరు చేయించి పూర్తి చేయిస్తానన్నారు. నందివాడకు చెందిన 100 మంది మహిళలు కాంగ్రెస్‌లో చేరారు. మత్స్య కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు శివాజీ,నాయకులు మహేందర్‌రెడ్డి, రాంచంద్రం పాల్గొన్నారు.

గుర్తింపు కార్డుల పంపిణీ

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన మత్స్యకారులకు ఆదివారం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారులు ఆర్థికంగా ఎదగడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. అలాగే మత్స్య పారిశ్రామిక సహకార సంఘం గుర్తింపు ధ్రువ పత్రాన్ని మత్స్యకారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతిని మత్స్యకారులు సన్మానించారు.

సరిహద్దుల్లో పటిష్ట నిఘా



బోధన్: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దుల్లో జిల్లా అధికార యంత్రాంగం నిఘా పటిష్టం చేసింది. నగదు, మద్యం అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు చెక్‌పోస్టును ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. తెలంగాణ-మహారాష్ట్ర మధ్య ప్రధాన వారధిగా ఉన్న రెవెన్యూ డివిజన్ పరిధిలోని సాలూర అంతర్‌రాష్ట్ర చెక్ పోస్టు వద్ద ఆర్టీవో, ఎక్సైజ్ చెక్‌పోస్టులుండగా, కొత్తగా పోలీస్ చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. వరుసగా ఉన్న మూడు చెక్ పోస్టుల అధికారులు, ఉద్యోగులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు జిల్లా అధికార యంత్రాంగం అంతర్‌రాష్ట్ర సరిహద్దుల్లో పోలీసుశాఖ చెక్ పోస్టులను ఏర్పాటు చేసింది.

జాతీయస్థాయి కథల పోటీల్లో విద్యార్థి ప్రతిభ



అభిలాష్‌ను అభినందిస్తున్న సంస్థ ప్రతినిధులు

మోర్తాడ్: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, మాచిరాజు సాహిత్య కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కథల పోటీల్లో ఏర్గట్ల ఉన్నత పాఠశాల విద్యార్థి అభిలాష్ ప్రతిభ కనబరిచారు. 'మంచి మనసు' అనే కథకు బహుమతి లభించగా, నిర్వాహకులు ఆదివారం బహుమతిని అందించారని తెలుగు పండిత్ ప్రవీణ్ శర్మ తెలిపారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ కన్వీనర్ మృణాళిని, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత దాసరి వెంకటరమణ, కథల తాతయ్య చొక్కాపు వెంకటరమణ, నేషనల్ బుక్ ట్రస్ట్ కన్వీనర్ మోహన్, మాచిరాజు సాహిత్య కళాపీఠం అధ్యక్షుడు కామేశ్వరరావు చేతుల మీదుగా అభిలాష్‌కు నగదు పురస్కారం అందుకున్నాడు. విద్యార్థిని ప్రోత్సహించిన తెలుగు పండిత్ ప్రవీణ్‌శర్మను సైతం నిర్వాహకులు సత్కరించారు. ప్రవీణ్ శర్మ, అభిలాష్‌ను ప్రధానోపాధ్యాయుడు కృష్ణాచారి, ఉపాధ్యాయులు అభినందించారు.

వాహనం ఒకరిది.. ఫైన్ మరొకరికి



జరిమానా విధించాల్సిన వాహనం



జరిమానా విధించిన వాహనం

బీబీపేట: టార్గెట్‌ని పూర్తి చేసేందుకు పోలీసుల చూపుతున్న అత్యుత్సాహం సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తోంది. వాహనం నంబర్ తప్పుగా నమోదు చేసి ఒకరికి విధించాల్సిన జరిమానా మరొకరికి విధించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గత నెల 31వ తేదీన టీఎస్ 17 ఎం 3175 వాహనానం ఫొటోను కామారెడ్డి దగ్గర దేవునిపల్లి వద్ద తీసి రూ.100 జరిమానా విధించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసేటప్పుడు టీఎస్ 17 హెచ్ 3175గా నమోదు చేయడంతో బీబీపేటకు చెందిన దీటి బాలయ్య మొబైల్‌కు జరిమానా మెస్సేజ్ వచ్చింది. దీంతో కంగుతిన్న అతడు తాను బీబీపేటలో ఉండగా టేక్రియాల్‌లో ఎలా జరిమానా విధించారని ఆన్‌లైన్‌లో చెక్‌చేయగా తన వాహనంపై జరిమానా చూయిస్తోంది. పోలీసుల పొరపాటు కారణంగా బాలయ్య జరిమానా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి



ఇందల్వాయి: మండలంలోని సిర్నాపల్లి గ్రామ పరిధిలోని రాంసాగర్ తండాకి చెందిన అజ్మీరా చందర్(49) చేపలవేటకు వెళ్లి మృతి చెందాడు. తన పొలం పక్కన ఉన్న చెరువులో చేపలను వేటాడేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందినట్లు ఎస్సై మనోజ్ కుమార్ తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారని, చిన్న కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని మరొకరు..

బాన్సువాడ: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని కొల్లూరు సబ్ స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. రైతునగర్ గ్రామానికిచెందిన సాకలి రాములు(26) ద్విచక్ర వాహనంపై బీర్కూర్ నుంచి బాన్సువాడ వైపు వెళ్తూ కొల్లూర్ సబ్ స్టేషన్ సమీపంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో రాములు అక్కడికక్కడే మృతి చెందాడు.

ఇంట్లోకి దూసుకెళ్లిన కారు

ఖలీల్‌వాడి: మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడంతో కారు అదుపుతప్పి ఓ ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటన నగరంలోని రెండో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల గాజుల్‌పేట్‌లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గాజులపేట్ మున్నూరుకాపు సంఘం వద్ద ఓ ఇంట్లోకి కారు దూసుకువెళ్లడంతో చుట్టుపక్కల వారు ఉలిక్కిపడ్డారు. కారు ప్రహరీని ఢీకొట్టి ఇంట్లోకి దూసుకెళ్లడంతో అందులో ఉన్న ముగ్గురు పరారయ్యారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని కారును స్టేషన్‌కు తరలించినట్లు తెలిసింది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని నాందేవ్‌వాడలో తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. మూడో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై మహేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన దత్తాద్రి నాందేవ్‌వాడలోని శివాజీ భోస్లే అనే వ్యక్తి ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి సొంతూరికి వెళ్లాడు. ఆదివారం తెల్లవారుజామున దత్తాద్రి అద్దెకు ఉంటున్న పోర్షన్ తలుపులు తెరిచి ఉండడంతో శివాజీ వెంటనే ఆయనకు సమాచారం అందించాడు. దత్తాద్రి ఇంట్లో నుంచి దుండగులు మూడు తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదు ఎత్తుకెళ్లినట్లు శివాజీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

బోధన్‌టౌన్(బోధన్): బాలికను వేధించి, భయభ్రాంతులకు గురి చేసిన యువకుడిపై పోక్సో, అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌కు చెందిన 13 ఏళ్ల బాలికను నర్సాపూర్ గ్రామానికి చెందిన యువకుడు శుక్రవారం రోజు రాత్రి 8 గంటలకు వేధించి భయభ్రాంతులకు గురిచేశాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

దర్గాకు వచ్చి అనంత లోకాలకు..

- మంచిప్ప చెరువులో మునిగి ఇద్దరు యువకులు మృతి
- మృతులు హైదరాబాద్‌వాసులు..



ఘటనాస్థలంలో వాసిక్, యాకూబ్ మృతదేహాలు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని మంచిప్ప చెరువులో మునిగి హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ వాసిక్ (32), సయ్యద్ యాకూబ్ (32) ఆదివారం మృతిచెందారు. దర్గాకు హైదరాబాద్ నుంచి వచ్చిన యువకులు ఇక్కడ మృతిచెందడం అందరినీ కలిచివేసింది. ఎస్‌హెచ్‌వో యాదగిరిగౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. హైదరాబాద్‌లోని చంచల్‌గూడకు చెందిన ఆరుగురు కుటుంబ సభ్యులు, మిత్రులు కలిసి మండలంలోని మంచిప్పలోని దర్గాను దర్శించుకునేందుకు ఆదివారం ఉదయం వచ్చారు. స్నానం చేసేందుకు దర్గాను ఆనుకుని ఉన్న పెద్ద చెరువుకు వెళ్లారు. ఈ క్రమంలో సయ్యద్ వాసిక్, సయ్యద్ యాకూబ్‌కు ఈత రాక నీటిలో మునిగిపోయారు. ఇరువురు మునిగిపోవడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు మిత్రులకు సమాచారమిచ్చారు. స్థానికులు ఇరువురి కోసం గాలించగా యాకూబ్ మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. వాసిక్ మృతదేహం కోసం గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్ల సహాయంతో వాసిక్ మృతదేహాన్ని వెలికితీశారు. పంచనామా నిర్వహించిన పోలీసులు ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలించారు. వాసిక్ కరాచీ బేకరీలో అకౌంటెంట్‌గా పని చేస్తుండగా, యాకూబ్ ఆటోమొబైల్ దుకాణంలో పని చేస్తున్నాడు. ఇరువురికి వివాహం కాగా, పిల్లలు ఉన్నారు. యాకూబ్ తండ్రి ఖాసీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో యాదగిరిగౌడ్ తెలిపారు.

భర్త మందలించాడని ఆత్మహత్య



లక్ష్మి మృతదేహం

మాచారెడ్డి: ఫోన్‌లో ఎవరితో మాట్లాడుతున్నావని భర్త మందలించడంతో భార్య చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన పాల్వంచ మండలం పోతారంలో ఆదివారం చోటుచేసుకుంది. మాచారెడ్డి ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..

గ్రామానికి చెందిన పోతుల సత్యం, చిన్నలక్ష్మి 2013లో కులాంతర వివాహం చేసుకున్నారు. వారికి హర్షవర్ధన్, సహస్ర పిల్లలు ఉన్నారు. శనివారం మధ్యాహ్నం సత్యం బయటనుంచి వచ్చిన సమయంలో లక్ష్మి ఫోన్‌లో మాట్లాడుతోంది. ఎవరితో మాట్లాడుతున్నావని ఆయన ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. ఆదివారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన లక్ష్మి గ్రామ సమీపంలోని చెరువులో శవమై కనిపించింది. మృత దేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీకి పాల్పడిన నిందితుడు అరెస్ట్




వివరాలు వెల్లడిస్తున్న సీఐ మల్లేశ్

జక్రాన్‌పల్లి : మండలంలోని అర్గుల్‌లో గత నెల 18న చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ మల్లేశ్ తెలిపారు. జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో కేసుకు సంబంధించిన వివరాలను ఆదివారం ఆయన వెల్లడించారు. గత నెల 18న అర్గుల్‌కు చెందిన మగ్గాడి గంగాధర్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగుడు చొరబడి బంగారు ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. చోరీ చేసిన సొత్తుతో హైదరాబాద్‌కు వెళ్తున్న మహారాష్ట్రకు చెందిన ఆనందరావు నాందేవ్ అలియాస్ జ్ఞానేశ్వర్‌ను డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో అదుపులోకి తీసుకుని విచారించగా, అర్గుల్‌లో చోరీకి పాల్పడింది తానేనని ఒప్పుకున్నాడు. నిందితుడు గతంలో వేల్పూర్, జక్రాన్‌పల్లి, బాల్కొండ చుట్టుపక్కల ప్రాంతాల్లో చోరీకి పాల్పడి జైలుకు వెళ్లివచ్చాడు. నిందితుడి వద్ద నుంచి ఐదు తులాల బంగారు ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. సమావేశంలో ఎస్సై తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు ఆదివారం తెలిపారు. గత నెల 31న చికెన్ తీసుకువస్తానని ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె ఇంటికి తిరిగి రాలేదు. పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో భర్త సాయిలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాక్లూర్: సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రాజశేఖర్ సూచించారు. మండల కేంద్రంలో కొత్త చట్టాలు, సైబర్ నేరాలు అనే అంశంపై ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఎస్సై హాజరై మాట్లాడారు. సెల్ ఫోన్లకు వచ్చే గుర్తు తెలియని ఏ మెసేజ్‌లను ఓపెన్ చేయొద్దని సూచించారు. అలా ఓపెన్ చేస్తే బ్యాంకు ఖాతాల్లో నగదు ఖాళీ అవుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాంగ్రెస్ నాయకుడు వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ అనిల్ కుమార్, రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.